నేడు జిల్లాకు హోంమంత్రి రాక

రేపు డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్

అనంతపురం క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం జిల్లాకు రానున్నారు. సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. 6 గంటలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పోలీస్ అధికారులతో మంత్రి సమావేశమవుతారు. రాత్రి ఇక్కడే బస చేస్తారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ)లో 2023 బ్యాచ్‌కు చెందిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి హోంశాఖ మంత్రి అనిత, డీజీపీ ద్వారకాతిరుమలరావు హాజరవుతారు.

భళే యాపారం..!

పోస్టుల భర్తీకి లక్షల్లో లంచాలు

- హెల్పర్ల ప్రమోషన్‌కూ వసూళ్లు
- మధ్యవర్తిగా వైసీపీ నాయకుడు
- ఆఫీసుకు ఎప్పుడొస్తారో కూడా తెలియదు
- ఐసీడీఎస్‌లో అక్రమాలతో చెలరేగిన అధికారి



కళ్యాణదుర్గం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అడిగేవారు లేకపోవడంతో ఆ ఉన్నతాధికారి చెలరేగిపోతున్నారు. అక్రమాలకు పాల్పడుతూ రూ.లక్షలు పోగేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐసీడీఎస్ శాఖలో పోస్టుల అమ్మకంతో సొమ్ములు వెనకేసుకుంటున్నారు. లంచాలు పుచ్చుకుని హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే నోటిఫికేషన్ లేకుండానే కొన్ని పోస్టులను భర్తీ చేశారు. ఓ వైసీపీ నాయకుడిని మధ్యవర్తిగా పెట్టుకుని వసూళ్ల వ్యవహారం నడిపారు. అప్పట్లో మంత్రిగా పని చేసిన ఉషశ్రీచరణ్ అండదండలు కూడా ఆ ఉన్నతాధికారికి ఉండటంతోనే అక్రమంగా పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం రాకతో వణుకు

కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ ఉన్నతాధికారిలో వణుకు మొదలైంది. పోస్టుల భర్తీ విషయంలో ఎప్పుడు, ఎవరు ఏమి అడుగుతారో నని తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఐసీడీఎస్ పీడీల ద్వారా నోటిఫికేషన్ వెలువడిన తర్వాతనే పోస్టులను భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోకుండా ఆ అధికారి పోస్టులను భర్తీ చేసేశారు. ఒక్కో పోస్టుకు రూ. లక్ష నుంచి రూ. 2.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఆ ఉన్నతాధికారికి, ఓ జూనియర్ అసిస్టెంట్ కూడా తోడైనట్లు సమాచారం. వీరిద్దరూ కుమ్మక్కై పోస్టులను భర్తీ చేయడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అక్రమ వసూళ్ల ద్వారా వచ్చిన సొమ్మును వీరిద్దరూ వాటాలు వేసుకుని పంచుకున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో ప్రశ్నించే వారు లేరన్న ధీమాతో పోస్టులను ఎడాపెడా భర్తీ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఆఫీసుకు వస్తే ఒట్టు ..!

ఆ ఉన్నతాధికారి ఏ మాత్రం కార్యాలయానికి రారు. ఎప్పుడూ ఆడ మీటింగ్ ఉంది. ఈడ మీటింగ్ ఉందని చెబుతుంటారు. ఈక్రమంలో ఆ అధికారి ఆఫీసుకు వచ్చేది లేనిది ఎవరికీ తెలియకుండా పోతోంది. కనీసం ఆ కార్యాలయంలో పని చేసే సిబ్బంది కూడా తెలియదంటే ఆ అధికారి పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈక్రమంలోనే సూపర్‌వైజర్లు సైతం విధులకు ఇష్టానుసారం వస్తున్నారు. దీంతో అంగన్‌వాడీల పనితీరు అధ్వానంగా మారింది. ప్రతి రోజు జిల్లా కేంద్రం నుంచి సూపర్‌వైజర్లు వచ్చి పోతుంటారు. వీరి పని తీరుపై ఆరా తీసే ఉన్నతాధికారి కూడా విధులకు సక్రమంగా రాకపోవడంతో సూపర్‌వైజర్లు విధులకు డుమ్మా కొడుతున్నారు. ఓ మండల కేంద్రంలో పౌష్టికాహారం అంతా డంప్ చేసుకుని, సూపర్‌వైజర్లు, అక్కడ ఉన్న సిబ్బంది దాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో పౌష్టికాహారాన్ని అంతా ఒకచోట డంప్ చేసి కర్ణాటక ప్రాంతానికి తరలించి అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా ఆ ఉన్నతాధికారి, సూపర్‌వైజర్ల కనుసన్నల్లోనే నడిచిందని సమాచారం. వారంలో ఒక రోజు మాత్రమే విధులకు వచ్చి, నానా హడావుడి చేసి వెళ్లిపోతారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఏ విధంగా ఉందోనని అడిగే నాథుడే లేడనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ ఐసీడీఎస్ కేంద్ర పాలన అంతా భ్రష్టుపట్టింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయ పనితీరుపై నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ఆరోపణలు వాస్తవమే

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ విషయంలో ఆ సీడీపీఓపై ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కూడా చేపట్టాం. అయితే నాకంటే ముందు పీడీగా పనిచేసిన ఓ అధికారి కూడా ఆ పోస్టుల భర్తీ విషయంలో విచారణ చేపట్టారు. అప్పట్లో వ్యవహారం అంతా ఓ కొలిక్కి వచ్చింది. నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ అధికారిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదు. ఎవరైనా ఆధారాలు సమర్పిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ బీఎన్ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

పెన్నహోబిలంలో పెళ్లి సందడి

ఉరవకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పెళ్లి సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెళ్లిళ్లతో పాటు వడిబియ్యం పోసుకునే భక్తుల రాకతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది.



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.21, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

బేఖాతర్..!

- మద్యం షాపుల వద్ద కానరాని నిబంధనలు
- ఎమ్మార్పీ పట్టికలు ఏవీ..?
- షాపు వద్దే యథేచ్ఛగా మద్యపానం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



ఆర్ఎఫ్ రోడ్డులోని వంక పక్కలో దుకాణం వద్దే మద్యపానం



నడిమి వంక పక్కన షాపు వద్దే మద్యాన్ని సేవిస్తున్న మందుబాబులు

అనంతపురం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల వద్ద నిబంధనల అతిక్రమణ జరుగుతోంది. ఐదు రోజుల కిందట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎక్సైజ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మద్యం షాపుల్లో నిబంధనలు పాటించేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. అన్ని షాపుల్లో తప్పని సరిగా మద్యం ధరల పట్టికను ప్రదర్శించేలా చూడాల న్నారు. ప్రతి మద్యం షాపులో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. తరచూ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, నిబంధనల అతిక్రమణలకు అడ్డుకట్టవేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో అధికారులెవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయితే ఆయన ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలను జిల్లాలోని పలు మద్యం స్టేషన్ల పరిధిలోని అధికారులు అమలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 136 ప్రైవేటు మద్యం షాపులు నడుస్తున్నాయి. ఇప్పటి దాకా ఏ ఒక్క షాపు వద్ద మద్యం ధరల పట్టికలు పెట్టలేదు. ప్రతి షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఆ ఊసే కనిపించడం లేదు. షాపుల వద్ద మద్యాన్ని తాపించడం నిషేధం. అయితే నగరంలోని పలు మద్యం షాపుల వద్దనే తాగుడు వ్యవహారం నడుస్తోంది. అనంతపురం నగరం నడిమి వంక పక్కనే ఉన్న మద్యం షాపుల్లో షాపు ఏర్పాటు చేసిన తొలి రోజు నుంచే ప్రతి రోజు మద్యాన్ని అక్కడే తాపిస్తున్నారు. మద్యంతోపాటు షాపులోనే గ్లాస్‌లు, తినుబండారాలు అమ్ముతు న్నారు. మద్యం ప్రియులకు అక్కడే మద్యం తాగే వెలుసుబాటు కల్పించారు. దీంతో మందుబాబుల వల్ల చుట్టు పక్కల షాపుల నిర్వాహకులు, అటుగా వెళ్లే ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతపురం లోని ఆర్ఎఫ్ రోడ్డు వంక పక్కన, కళ్యాణదుర్గం రోడ్డులోని షాపుల వద్దే మద్యపానం జరుగుతోంది. ఇలా అనంతపురం నగరంతోపాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో షాపుల వద్దనే మద్యం సేవిస్తుండటం గమనార్హం. ఇదంతా స్థానిక ఎక్సైజ్ అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇంతవరకు ఎక్కడేగాని డెకాయ్ ఆపరేషన్లు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఎక్సైజ్ అధికారులు తమ బద్దకాన్ని పక్కనపెట్టి నిబంధనల అతిక్రమణలకు పాల్పడుతున్న మద్యం షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోలవరంపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మండిపడ్డారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రచార కార్యదర్శి కూచి హరితో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లు రివర్స్‌టెండరింగ్ పేరుతో పోలవరాన్ని సర్వనాశం చేసి, ఇప్పుడు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వైసీపీ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ పాలకుల తప్పిదాలతోనే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడం, భారీ గుంతలు ఏర్పడ్డాయన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చేనాటికి ప్రాజెక్టును రెండు దశల్లో నిర్మాణం చేసేందుకు ఆమోదం లభించిందన్నారు. కేంద్ర కేబినెట్ వద్ద సీఎం చంద్రబాబు చొరవతోనే మొదటి దశ పనులకు ఆమోదం లభించిందన్నారు. గత జగన్ ప్రభుత్వం 30 మంది ఎంపీలతో కనీసం పోలవరానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును గత వైసీపీ సర్కార్ జీవచ్ఛవంగా మారిస్తే.. సీఎం చంద్రబాబు ప్రజల జీవనాడిగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు పనికిమాలిన ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



హెచ్చెల్సీ



జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. వైసీపీ పాలనలో జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులు నిధులు లేక నీరసించిపోయాయి. హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ పూర్తికి అవసరమైన భూసేకరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. హంద్రీనీవా కాలువ వెడల్పుతో పాటు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పట్ల గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన బీటీపీ, పేరూరు ప్రాజెక్టుల పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని జిల్లా ప్రజలు, రైతులు ఆశాభావంతో ఉన్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్, ఆంధ్రజ్యోతి

నిరీక్షణ

నిధుల కోసం నీటి ప్రాజెక్టుల ఎదురుచూపు



హంద్రీనీవా కాలువ

వైసీపీ పాలనలో అన్ని ప్రాజెక్టులు నిర్వీర్యం

ముందుకు సాగని హెచ్చెల్సీ ఆధునికీకరణ

హంద్రీనీవా కాలువ వెడల్పు కథ అంతేనా..?

అగమ్యగోచరంగా బీటీపీ, పేరూరు పరిస్థితి..!

కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగేనా?

ప్రతిపాదనలు పంపిన జలవనరుల శాఖ అధికారులు



ప్రతిపాదనలకు స్పందన ఏదీ?

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం(హెచ్ఎన్ఎస్ఎస్) కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.1200కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. గత ఐదేళ్లలో హంద్రీనీవా ఇంజనీర్లు సుమారు మూడు దపాలుగా ప్రభుత్వానికి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపినా ఎలాంటి స్పందన లేదు. ఉరవకొండ ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వం 38వేల ఎకరాలకు సంబంధించి పనులు ప్రారంభించినా, వైసీపీ ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. గుంతకల్లు, గుత్తి పరిధిలోని 12మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని అందించేందుకు రూ.20కోట్లతో చేసిన ప్రతిపాదలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.

సీఎల్‌డీఐని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకువచ్చింది. ఉరవకొండ ప్రాంతంలోని బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.840కోట్లతో 2017లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ సీఎల్‌డీఐ పథకాన్ని రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన పరికరాలు మూలనపడేశారు. ప్రస్తుతం ఉరవకొండ నుంచి గెలిచి కూటమి ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా కీలక స్థానంలో పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తుండటంతో నియోజకవర్గానికి దశ మారుతుందని అధికారులు చెబుతున్నారు.

బిల్లులన్నీ పెండింగ్‌లోనే..

గత టీడీపీ ప్రభుత్వం కరువు జిల్లాను సస్యశ్యామలం చేయాలని బీటీపీ, పేరూరు ప్రాజెక్టులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో రాష్ట్ర ప్రభుత్వం రూ.541కోట్లు నిధులు కేటాయించింది. అయితే చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం రూ.20కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్ల తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టును రూ.591 కోట్లతో చేపట్టారు. 53 కిలోమీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.164కోట్లు పనులు చేయగా రూ.100కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆగిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. 2008-09లో రూ.458కోట్లతో హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ ప్రారంభించారు. 2018వరకు రూ.310కోట్ల పనులు జరిగాయి. ఇక మిగిలిన రూ.148కోట్ల పనులను రద్దు చేస్తూ 2019లో ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులను అలాగే కొనసాగించి ఉంటే ఇప్పటికి పూర్తి అయ్యేవి. ప్రస్తుత ధరల ప్రకారం రూ.148కోట్ల పెండింగ్ పనుల విలువ రూ.500కోట్లకు చేరిందని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు చెబుతున్నారు. ఆధునికీకరణ పూర్తి చేస్తే 2600క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలువను 4200క్యూసెక్కులకు పెంచుకునే అవకాశం ఉంటుంది. దీంతో టీబీ డ్యాం నుంచి అదనంగా వరద జలాలను జిల్లాకు తీసుకునే వెసులుబాటు కలుగుతుంది.

పీఏబీఆర్‌కు భూసేకరణే సమస్య

జిల్లాలో అతిపెద్ద రిజర్వాయర్ పెన్నా అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్). దీని నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలు. ఇప్పటి వరకు ఎప్పుడూ 11టీఎంసీలు నిల్వ ఉంచలేదు. పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచాలంటే మిగిలిన భూసేకరణ చేపట్టి, నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. పీఏబీఆర్ సామర్థ్యం అంచనా వేసేందుకు టెస్టుల చేయడానికి పూణేకు చెందిన సీడబ్ల్యూసీ కంపెనీ రూ.5కోట్లు అడిగింది. వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. 11టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి మరో రూ.450కోట్లు నిధులు అవసరం ఉంది. ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్‌కు అవసరమైన రూ.4.8కోట్ల విడుదలను కూడా వైసీపీ ప్రభుత్వం విస్మరించింది.

ప్రతిపాదనలు పంపాం



జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాధాన్యతను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఇంజనీర్ల అభిప్రాయా లను తీసుకున్నారు. హంద్రీనీవా కాలవ కింద డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.1200కోట్లు ప్రతిపాదనలు పంపాం. మడకశిర బైపాస్ కెనాల్, గుంతకల్లు, పుట్టపర్తి మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీళ్ల నింపే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. ఉరవకొండ ప్రాంతంలో సా మూహిక బిందు సేద్యం పథకాన్ని పునరుద్ధరిస్తే అద్భుతమైన ఫలితాలు వ స్తాయి. హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేసి, డిస్ట్రిబ్యూటరీలను ని ర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది.

- నాగరాజ, జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ



తట్టఇడ్లీని బాక్స్‌లోకి వేస్తున్న నిర్వాహకుడు

'తట్ట' రుచే వేరు..!

ఆహారప్రియులను ఆకర్షిస్తున్న తట్ట ఇడ్లీ



కారంనెయ్యి కలిపిన తట్టఇడ్లీ

అనంతపురం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఫుడ్ లవర్స్‌ను వివిధ రకాల వెరైటీలతో ఆకర్షిస్తుంటారు. రుచి, శుచితో పాటు ఇదీ మా 'ప్రత్యేకత' అని చెబుతుంటారు. ఈ కోవకు చెందినదే తట్ట ఇడ్లీ. సాధారణంగా మనకు తెలిసిన ఇడ్లీ అరచేతిలో పట్టేదిగా కాస్త అటూ ఇటుగా ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం భారీ సైజులో ఉంటుంది. సైజులోనే కాదు రుచిలో కూడా అద్భుతం అనేలా ఉంటుంది ఈ తట్ట ఇడ్లీ. ఇలాంటి భారీ ఇడ్లీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది నగరంలోని జేఎన్‌టీయూ కళాశాల ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న బెంగళూరు తట్ట ఇడ్లీ (బీటీఐ) హోటల్. ఇక్కడ భారీ ఇడ్లీకి కాంబినేషన్‌గా పప్పులచెట్నీ, అల్లంచెట్నీ, సాంబారు ఇస్తారు. అలాగే ఇడ్లీపైన మసాలాకారం, దానిపై నెయ్యివేసిమరో వెరైటీలో ఇడ్లీ ఇస్తున్నారు. ఇక్కడ ఉదయం రెండు ఇడ్లీలు తింటే మధ్యాహ్నం వరకు ఆకలి కాదని తిన్నవారు చెబుతుంటారు.

జీతాల కోతపై ఆగ్రహం

డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట వైద్య ఉద్యోగుల ఆందోళన



నిరసన తెలుపుతున్న వైద్యశాఖ ఉద్యోగులు, ఎన్జీఓ నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విధులలో ముఖహాజరు వేయలేదని జీతాలలో కోత పెట్టడంపై వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు 91మంది వైద్యసిబ్బందికి ఈనెల జీతాలలో భారీగా కోతపెట్టారు. దీంతో ఆదివారం ఎన్జీఓ నాయకుల మద్దతుతో వైద్యశాఖలోని ఎన్‌హెచ్ఎం వైద్యసిబ్బంది డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిం చారు. ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఎన్‌హెచ్ఎం వైద్యఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల వేతనాలకు ముఖ హాజరు(ఎఫ్ఆర్ఎస్) లింకు పెట్టడం అన్యాయమన్నారు. ఆన్‌లైన్ ముఖహాజరులో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. సర్వర్ సమస్యవల్ల చాలామంది విధులకు వెళ్లినా సకాలంలో హాజరు పడటం లేదన్నారు. ఇంకొంతమంది మహిళా వైద్యఉద్యోగులకు అదనంగా ఉన్న స్పెషల్ క్యాజువల్ లీవ్స్ చూపకపోవడం వల్లకూడా గైర్హాజరు కింద చూపిస్తోందన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేసే వైద్య ఉద్యోగులకు ముఖహాజరు మినహాయించాలని ముందునుంచి కోరుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం వేతనాల కోత నిర్ణయాన్ని విరమించుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోలనలు చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లావైద్యశాఖ ఏఓ గిరిజామనోహరను కలిసి వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు శ్రీనివాస్‌కుమార్, జమీలాబేగం, శ్రీధర్‌బాబు పలువురు వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

మా అమ్మ.. మాకొద్దు..!

తిరుపతమ్మను తీసుకెళ్లేందుకు నిరాకరించిన బిడ్డలు

పోలీస్‌స్టేషన్‌లో విచారించిన సీఐ జయన్న



వృద్ధురాలు తిరుపతమ్మ కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయన్న

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'నడి రోడ్డుపై అమ్మ' కథనం రాష్ట్ర వ్యాప్తంగా ఆవేదన కలిగించినా ఆమె కొడుకు, కుమార్తెల్లో ఇసుమంతైనా దయ కలగలేదు. తల్లిని తమతో తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ కొడుకు, కుమార్తెలు పోలీసుల ఎదుటే తేల్చి చెప్పారు. కన్నతల్లిని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిన వృద్ధురాలు తిరుపతమ్మ కొడుకుతోపాటు కూతుళ్లకు పత్తికొండ సీఐ జయన్న ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంతకల్లులో ఉన్న కొడుకు శ్రీనివాసులు, ఆయన భార్యతో పాటు బళ్లారిలో ఉంటున్న కుమార్తె, అల్లుడు, పత్తికొండలో ఉంటున్న మరో కుమార్తె, అల్లుడు ఆదివారం రాత్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆసుపత్రిలో దయనీయ స్థితిలో ఉన్న తల్లిని తీసుకెళ్లాలని సీఐ వారికి సూచించారు. అయితే తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తాము తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ వారు స్పష్టం చేశారు. సీఐ ఎంత నచ్చచెప్పినా వారు వినలేదు. అయినప్పటికీ వారికి సోమవారం గడువు ఇస్తున్నామని, లేదంటే చట్టప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

ఫ్యాక్టరీదే నిర్లక్ష్యం

నిబంధనలు పాటించలేదని ప్రాథమిక నిర్ధారణ

సప్తగిరి కర్పూరం కర్మాగారానికి షోకాజ్ నోటీసు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం లోలూరు వద్ద సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమలో జరిగిన ఘటనపై విచారణ కమిటీ ఆదివారం రాత్రి ప్రాథమిక నివేదికను కలెక్టర్ వినోద్ కుమార్‌కు అందజేసింది. శుభ్రం చేసేటపుడు, వెల్డింగ్‌చేసే సమయంలో, కార్మికులు రియాక్టర్‌లోకి దిగేటపుడు పరిశ్రమ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని విచారణ కమిటీ అధికారులు తేల్చారు.కనీసం ఆక్సిజన్ అందించే పరికరాలు కూడా కార్మికులకు అందించలేదని పేర్కొన్నారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ఫ్యాక్టరీల చట్టం ప్రకారం తొలుత సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. పరిశ్రమ సమాధానం ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

డాడీ ఎక్కడా అంటే ఏమని చెప్పను..!

వాడి అల్లరి భరించలేను.. లెయ్ మహేష్..

భర్త మృతదేహంపైపడి విలపించిన భార్య



భర్త మృతదేహంపై పడి విలపిస్తున్న భార్య

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'డాడీ ఎక్కడికి వెళ్లాడని అడిగితే ఏమని చెప్పను.. వాడి అల్లరి భరించడం నావల్ల కాదు.. లెయ్ మహేష్..' అంటూ మృతుడిపై పడి భార్య ప్రవళిక బోరున విలపించిన సంఘటన అందరినీ కలిచివేసింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బండపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు వంగవేడు వంకలోపడి మహేష్(36) మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన మహేష్ హిందూపురంలో నివాసముంటున్న అత్త కూతురు ప్రవళికను ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో బెంగళూరులో నివాసముంటున్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని బండపల్లికి వెళ్లారు. ఈ క్రమంలో మహేష్, భార్య ప్రవళిక, తమ్ముడు రాజేష్, అతడి భార్య శిరీష కలిసి గ్రామ సమీపంలోని వంగవేడు వంకలో ఈత కొట్టడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు మహేష్ వంక ఉధృతికి కొట్టుకుపోయి ఇరుక్కుపోయాడు. రక్షించేందుకు తమ్ముడు, భార్య ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమీపంలో ఉన్న స్థానికులు వచ్చి బయటకు తీశారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ప్రవళిక, కుమారుడు అగస్త్య ఉన్నారు. చిన్న వయసులోనే మహేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం దద్దరిల్లింది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలు మృతి

నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్

తూర్పుగోదావరి జిల్లాలో ఘటన

మృతులు అనంతపురం వాసులు



లారీని ఢీకొన్న కారు

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో వృద్ధులైన అక్కా చెల్లెళ్లు మృతి చెందారు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంలోని శారదానగర్‌కు చెందిన కనకదుర్గ (84) శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. వీరిద్దరికీ వివాహం కాలేదు. వీరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. వాటిని అద్దెకు ఇచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వెళ్లి అద్దె వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ సాకే సూర్యనారాయణ (45)తో కలిసి కారులో ఈ నెల 2న సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు బయల్దేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడ దాటిన తరువాత ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. నిద్రమత్తులో దానిని గమనించని కారు డ్రైవర్ వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన రాజేశ్వరి, సూర్యనారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్ది సేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.



ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి, కనకదుర్గ (ఫైల్ ఫొటోలు)

స్థలం విషయంలో ఘర్షణ

టీడీపీ కార్యకర్తలకు గాయాలు



గాయపడిన కరే వెంకటేష్

రాప్తాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగినేపల్లి గ్రామంలో ఇంటి దగ్గర స్థలం విషయంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీ మద్దతుదారులైన కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు.... భోగినేపల్లిలో కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతుల ఇంటి వద్ద స్థలం విషయమై గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఘర్షణ జరిగింది. అప్పుడు కూడా వైసీపీ కార్యకర్తలు కరే వెంకటేష్, నారాయణమ్మ దంపతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తాజాగా ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో మరోసారి స్థలం విషయమై టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వైసీపీ కార్యకర్తలైన కోలాల ప్రవీణ్, కోలాల ఉజ్జినప్ప, నాగమ్మ, కోలాల లక్ష్మీనారాయణమ్మలు టీడీపీ మద్దతుదారులైన కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతులపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్, నారాయణమ్మ దంపతులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

'సత్యంలోనే పరమాత్ముడి స్వరూపం'



అనుగ్రహభాషణం చేస్తున్న మల్లాది వేంకట రామనాథ శర్మ

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యంలోనే భగవంతు డి స్వరూపం ఉందని బ్రహ్మశ్రీ మల్లాది వేంకట రామనాథ శర్మ పే ర్కొన్నారు. భారతీతీర్థ స్వామి సన్యాసాశ్రమ స్వీకార స్వర్ణోత్సవాలను పుర స్కరించుకుని శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో ఆదివారం సా యంత్రం శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది వేంకట రామనాథశర్మ అనుగ్రహ భాషణం చేస్తూ... పరబ్రహ్మ లేకపోతే సృష్టే లేదన్నారు. శ్రీకృష్ణుడు తాను చేయాల్సిన కార్యాలన్నింటిని చేసిన తర్వాత దశావతారాలను చూపించారన్నారు. ప్రతిఒక్కరూ ఎల్లప్పుడూ భాగవత పఠనం చేసి సారాన్ని ఆస్వాదించాలని, అప్పుడు భగవంతుడి సాక్షాత్కారం జరిగినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకుడు సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఏలూరులో ఆదివారం ఏపీ చెస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ర్యాంకింగ్ చెస్ టోర్న మెంట్-2024 పోటీలకు జిల్లా నుంచి పలవురు క్రీడాకారులు ప్రాతిని ధ్యం వహించారు. అండర్-8 బాలికల క్యాటగిరీలో మనస్వి మల్కా నాలుగో స్థానం, అండర్-10లో అవుటి సుకృత నాలుగో స్థానం, శారోన్ బ్లెస్సీ ఐదో స్థానం సాధించారు. అండర్-10 బాలుర క్యాటగిరీలో సాయి యశస్ మొదటి స్థానం, అండర్-14లో సాయి మనోజ్ కృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు చెస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



నటి సుగమ్య శంకర్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

అమరన్ నటి ఇంట్లో సందడి

హీరో శివకార్తికేయన్ సోదరిగా నటించిన పెనుకొండ వాసి సుగమ్య శంకర్

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్ధమాన నటి సుగమ్య శంకర్ ఇంట్లో ఆదివారం సందడి నెలకొంది. 2014లో కశ్మీర్‌లో వీరమరణం పొంది భారతదేశ అత్యున్నత పురస్కారమైన అశోకచక్ర బిరుదుతో గౌరవించిన గొప్ప సైనికుడు, తమిళనాడుకు చెందిన మేజర్ ముకుంద వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కించిన సినిమా అమరన్. ఈ చిత్రంలో మేజర్ ముకుంద వరదరాజన్ పాత్రలో నటించిన శివకార్తికేయన్ సోదరి నిత్య వరదరాజన్‌గా పెనుకొండకు చెందిన సుగమ్య శంకర్ నటించారు. ఈ చిత్రం విజయవంతం కావడంతో కుటుంబ సభ్యులు నటి సుగమ్యకు స్వీట్లుపెట్టి సంతోషం వ్యక్తం చేశారు. పెనుకొండ వాసులతో కలిసి స్థానిక థియేటర్‌లో ఆమె సినిమా చూశారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ చైల్డ్ ఆర్టిస్ట్‌గా నాగభరణి, మర సినిమాల్లో నటించినట్లు తెలిపారు. వీరమరణం పొందిన మేజర్ సోదరిగా నటించడం గర్వంగా ఉందన్నారు. దేశానికి సంబంధించిన ఆర్మీ వారి జీవిత చరిత్ర సినిమాలో అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. మరో మూడు సినిమాల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి రవిశంకర్‌గురుజీ, తల్లి గాయత్రి, అన్న సునాగ్ శంకర్ భరద్వాజ్ సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బోధన.. వేదన..!


ప్రభుత్వ జూనియర్ కళాశాల



ఒక్కరినీ కేటాయించని ప్రభుత్వం

అతిథి, కాంట్రాక్టు సిబ్బందే దిక్కు

కుంటుపడుతున్న బోధన

అధ్యాపకులేలేని తాడిమర్రి జూనియర్ కాలేజీ

తాడిమర్రి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన కుంటుపడుతోంది. కాలేజీ కట్టారు తప్ప.. సిబ్బందిని నియమించ లేదు. కాలేజీ మొత్తానికి ఒక్కటంటే ఒక్క అధ్యాపకుడి పోస్టును కూడా కేటాయించలేదు. దీంతో అతిథి, కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. వారు కూడా అరకొరగా ఉండడంతో బోధన కుంటుపడుతోంది. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా అధ్యాపకులను నియమించి, బోధన సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి, తాడిమర్రి


సైన్స్‌ల్యాబ్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

మండలంలో 2008లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. తరువాత సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మండలంలోని మేడిమాకులపల్లికి చెందిన ఎర్రగంగు వెంకటేశ్ ఐదెకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఆ స్థలంలో కళాశాల భవనాన్ని నిర్మించి, 2016లో అందుబాటులోకి తెచ్చారు. భవనం కట్టారు కానీ, అధ్యాపక పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు. కళాశాలలో 147 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 11 మంది అధ్యాపకులను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. మరో ముగ్గురిని అదనపు విధుల కోసం కేటాయించాలి. ప్రస్తుతం ప్రిన్సిపాల్, అటెండర్ పోస్టులు మాత్రమే ఉన్నాయి. మిగిలిన వారందరూ అతిథి, కాంట్రాక్టు అధ్యాపకులే. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. పలుమార్లు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కళాశాల భవనంలో సైన్స్‌ల్యాబ్, తరగతి గదులు, డైనింగ్ హాల్‌తోపాటు పచ్చని మైదానం ఉన్నా.. అధ్యాపకుల్లేరని వారు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం



కళాశాలలో అధ్యాపకుల కొరత వాస్తవమే. అధ్యాపక పోస్టులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. అధ్యాపకులు వస్తే.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

- సురేశ్‌బాబు, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల

విభజనపై విద్యుత్ ఉద్యోగుల అసంతృప్తి

ఆందోళనలకు సిద్ధమవుతున్న జేఏసీ

నేడు ఉన్నతాధికారులకు వినతులు

అనంతపురంరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విద్యుత్ ఉద్యోగుల విభజనపై ఆ శాఖలో అసంతృప్తి రగులుతోంది. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకుల అభిప్రాయాలను కూడా తీసుకోకుండా విభజించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జేఏసీ నాయకులు ఆ శాఖ ఉన్నతాధికారులను కలవనున్నారు. ఇటీవల ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని సర్కిళ్లను విభజించి ప్రభుత్వం కొత్త విద్యుత్ సర్కిళ్లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా సర్కిళ్లుగా విభజించి అధికారులు, సిబ్బందిని కేటాయించింది. నిబంధనలకు విరుద్ధంగా విభజన ప్రక్రియ చేశారని.. సీనియార్టీ, పిల్లల విద్యాసంవత్సరం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సర్కిల్లో కనీస ఏర్పాట్లు చేయకుండా ఉద్యోగుల కేటాయింపు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా జేఏసీ నాయకులు ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం అనంతపురం జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈని కలసి వినతులు అందజేయనున్నట్లు జేఏసీ నాయకులు చెబుతున్నారు. స్పందన లేకపోతే ప్రత్యక్ష, పరోక్ష ఆందోళనలకు దిగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.


ఉమ్మడి జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయం

డిప్లొమా ఇంజనీర్ల సంఘం కార్యవర్గాల ఎన్నిక

అనంతపురం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలోని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పనిచేస్తున్న ఏపీ పీఆర్ డిప్లొమ ఇంజనీర్స్ ఆయా జిల్లాల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని పంచాయతీరాజ్ ఎస్‌ఈ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, రఘురాంరెడ్డి, ఎలక్షన్ ఆఫీసర్లు సంతోష్‌గౌడ్, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ సజావుగా నిర్వహించారు. అనంతపురం జిల్లా నూతన అధ్యక్షుడిగా మాధవ్‌కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జీఆర్‌వీ కిషోర్‌కుమార్, ఫైనాన్స్ సెక్రటరీగా ఎస్‌ఎండీ హుసేన్‌బాష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాబావలి ఎన్నికయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎస్‌ఏ అలీమ్ బాషా, ఉపాధ్యక్షుడిగా హనుమనాయక్, ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్, ఫైనాన్స్ సెక్రటరీగా శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమణరావు ఎన్నికయ్యారు. అనంతరం ఎంపికైన వారికి డిక్లేరేషన్ పత్రాలు అందజేశారు.


ఎంపికైన అనంతపురం జిల్లా కార్యవర్గానికి డిక్లేరేషన్ అందజేస్తున్న దృశ్యం


శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గానికి డిక్లరేషన్ అందజేస్తున్న దృశ్యం

కదలని రథం పనులు

పెన్నహోబిలంలో ఆగిపోయిన తయారీ

కలప నాణ్యతపై అధికారుల అభ్యంతరం


రథం చక్రం

ఉరవకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం తయారీ వచ్చే బ్రహోత్సవాల నాటికైనా పూర్తి అయ్యేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రథం తయారీ పనులు నాలుగు నెలలుగా ఆగిపోయాయి. రెండేళ్ల క్రితం పాత రథానికి మరమ్మతులు చేస్తున్న సందర్భంలో కూలిపోయి ధ్వంసమైంది. ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాల్లో పాత రథానికే మర్మతులు చేయించి ముగించారు. ఈ ఏడాది మార్చిలో ఎన్నికల సమయంలో హడావిడిగా రథం తయారీ పనులు ప్రారంభించారు. దీనికి రూ.1.78 కోట్లు కేటాయించారు. రథం టెండర్ల సమయంలో కూడా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం పెద్ద దుమారమే లేపింది. సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వారు నాలుగు నెలలుగా పనులు చేయడం ఆపేశారు. రథం తయారీకి ఉపయోగించే సామగ్రి నాణ్యత లేదన్న అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. కొత్త రథం తయారీకి అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి టెండర్ దక్కించుకున్నాడు. దానిని ఉరవకొండకు చెందిన వారికి సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చాడు. వారు ఇప్పటికే రూ.63 లక్షల దాకా రథం తయారీకి ఖర్చు పెట్టారు. వాటికి సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడంతోనే పనులు ఆపినట్లు తెలుస్తోంది. ఇటీవల బదిలీల్లో భాగంగా కొత్తగా అధికారి రావడంతో సబ్ కాంట్రాక్టర్, అధికారి మధ్య వివాదం నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండ్రోజుల క్రితం దేవదాయ శాఖకు చెందిన ఇంజనీర్ రథం తయారీ పనులు పరిశీలించారు.


రథం తయారీకి వాడుతున్న కలప

నాణ్యతలేని కలప వాడొద్దని చెప్పాం

రథం తయారీలో నాణ్యత లేని కలపను వాడద్దని సూచించాం. రథం నమూనాను తయారు చేసిన తర్వాతే పనులు చేపట్టాలి. టెండర్ సమయంలో రెండేళ్లలోపు పూర్తి చేసేలా అగ్రిమెంట్ ఉంది. పనులు ఆగిపోయిన విషయం నాకు తెలియదు. సబ్ కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లింపు అంశం నా దృష్టికి రాలేదు.

- శ్రీనివాసప్రసాద్, డీఈ, దేవదాయ శాఖ

దేవ్ ప్రమోద్ డబుల్ సెంచరీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్ర జ్యోతి): డబుల్ సెంచరీతో కదం తొక్కాడు దేవ్ ప్రమోద్. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అండర్-16 రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీలు నిర్వహించారు. ఏసీఏ-ఏ జట్టు, ఏసీఏ-బీ జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన టీం ఏ జట్టు 76.4 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌట్ అయింది. బీ జట్టు బౌలర్ మహిత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన ఏసీఏ-బీ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో ఏసీఏ-సీ జట్టు, ఏసీఏ-డీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన డీ జట్టు 77ఓవర్లలో 346 పరుగులకు ఆలౌటైంది. ఇందులో దేవ్ ప్రమోద్ 217 బంతుల్లో 39 బౌండరీలతో 215 పరుగులు చేశాడు. మొదటి రోజు ఆటముగిసే సమయానికి సీ జట్టు 11 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 29 పరుగులు చేసింది.


డబుల్ సెంచరీ చేసిన దేవ్ ప్రమోద్


5 వికెట్లు తీసిన మహిత్

ఆంధ్రా అండర్-15 జట్టులో ఇద్దరికి చోటు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 బాలికల జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన చక్రిక, తేజశ్వినికి చోటు దక్కింది. ఒడిశాలోని కటక్‌లో ఈనెల 21 నుంచి బీసీసీఐ అండర్-15 మహిళా క్రికెట్ జాతీయ స్థాయి టోర్నీకి ఆంధ్రా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. వారికి జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.


చక్రిక


తేజశ్విని

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 4 నుంచి చెన్నైలో నిర్వహించే హాకీ ఇండియా సీనియర్ మెన్ నేషనల్ చాంపియన్‌షిప్‌నకు ఆంధ్రా హాకీ సీనియర్ మెన్ జట్టు తరపున జిల్లాకు చెందిన క్రీడాకారులు జస్వంత్, చంద్రమౌళి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులకు హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్‌కుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ అభినందనలు తెలిపారు.


జస్వంత్, చంద్రమౌళి

జీడిపల్లికి 1108 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1108 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 1,068 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.658 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

కట్నం వేధింపులు భరించలేక నిప్పంటించుకుని మృతి


భవాని (ఫైల్)

కూడేరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పెళ్లయి తొమ్మిది ఏళ్లవుతున్నా అదనపు కట్నం కోసం అత్తారింటి వేధింపులు తగ్గకపోవడంతో తనువు చాలించింది ఓ మహిళ. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. కణేకల్లు మండలం తుమ్మిడురు గ్రామానికి చెందిన భవానికి కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన సిద్దార్థతో తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమయింది. ఆ సమయంలో ఐదు తులాల బంగారం, యాభైవేల నగదు చెల్లించారు. పెళ్లై కొన్ని రోజుల తర్వాత భర్త సిద్దార్థ, అత్త వీరమ్మ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. వీటిని భరించలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. అత్తారింటి వేధింపులు భరించలేక తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు పార్వతి, శంకర్‌గౌడ్ బోరున విలపించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేటి నుంచి శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, డైట్ సిబ్బందికి లీడర్‌షిప్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకూ రెసిడెన్షియల్ ట్రైనింగ్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. బళ్లారి రహదారిలోని సీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలను వేదికగా ఎంపిక చేశారు. మొత్తం 300 మంది ట్రైనింగ్‌కు హాజరుకానుండగా అనంతపురం జిల్లా నుంచి 100 మంది, సత్యసాయి జిల్లా నుంచి 100 మంది, అన్నమయ్య జిల్లా నుంచి 100 మందిని ఎంపిక చేశారు. వీరికి ఆరు రోజులు శిక్షణ ఇస్తారు. అదే విధంగా జిల్లాలో రెండో విడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ సైతం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో నిర్వహిస్తారు. అనంతపురం జిల్లా నుంచి 125 మంది, కర్నూలు నుంచి 125 మంది ఉపాధ్యాయులు హాజరుకానున్నారు. 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 9వ తేదీ వరకూ శిక్షణ ఇస్తారు.

10న రాష్ట్రస్థాయి మెడికల్ రెప్‌ల సదస్సు


సదస్సు పోస్టర్లను విడుదల చేస్తున్న మెడికల్ రెప్‌లు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 10న మెడికల్ రెప్‌ల రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్ తెలిపారు. ఆదివారం హెచ్‌ఎల్‌సీ కాలనీలోని కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగంలో మెడికల్ రెప్‌లు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు. సరైన గుర్తింపు, వేతనాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, జీతభత్యాలు, తదితర అంశాలపై సదస్సులో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మెడికల్ రెప్స్ పెద్దఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, శ్రీరామ్, కిరణ్, సురేంద్రగుప్త పాల్గొన్నారు.

పీకల్లోతు నష్టాల్లో ఏడీసీసీ బ్యాంకు

ఐదేళ్ల వైసీపీ పాలనలో కుదేలు



శాపంగా మారిన పర్సన్ ఇన్‌చార్జిలు

రాష్ట్రంలోనే చివరిస్థానం

అస్తవ్యస్తంగా నిర్వహణ

రైతులపై అధికవడ్డీ



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఏడీసీసీబీ) తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. మరోవైపు బ్యాంకు పాలన అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఖాతాదారులైన అన్నదాతల్లో రోజురోజుకీ బ్యాంకుపై విశ్వాసం సన్నగిల్లుతోంది. నష్టాలను పూడ్చుకునేందుకు రైతులపై రుణాలకు అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం, పర్సన్ ఇన్‌చార్జిల నియామకం బ్యాంకు, సొసైటీల పురోగతికి అడ్డంకిగా మారింది. రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా అథమ స్థానానికి పడిపోయింది. పర్సన్ ఇన్‌చార్జిలతో పాటు బ్యాంకును నడిపించాల్సిన సీనియర్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో పురోగతి మరింత కుంటుపడుతోంది.

రైతులపై అధిక వడ్డీల భారం

సొసైటీల నుంచి రైతులకు ఇచ్చిన రుణాలపై అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నాబార్డు ఆప్కాబ్ నుంచి 3.5 శాతం వడ్డీ వసూలు చేస్తుంది. నాబార్డు నుంచి నిధులు తీసుకున్న ఆప్కాబ్ ఏడీసీసీ బ్యాంకు నుంచి 5 శాతం వడ్డీ వసూలు చేస్తుంది. ఏడీసీసీ బ్యాంకు నుంచి సొసైటీలకు 6 శాతం వడ్డీకి ఇస్తున్నారు. సొసైటీలు రైతుల నుంచి 7శాతం వడ్డీ వసూలు చేయాలి. ఇందుకు భిన్నంగా 11.5 శాతం వరకు వసూలు చేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. రైతులకు సొసైటీ అధికారులు 7 శాతం వడ్డీ అంటూనే..రికార్డుల్లో మాత్రం 11.5 శాతం వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సొసైటీ, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే వడ్డీ రాయితీ రైతులకు అందక పోగా...అధిక వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతు బ్యాంకులుగా ఉన్న సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకులపై అన్నదాతలకు విశ్వాసం సన్నగిల్లుతోంది.

గడిచిన ఐదేళ్లలో కుదేలు

గడిచిన ఐదేళ్ల కాలంలో సహకార బ్యాంకులు, సహకార సొసైటీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఏడీసీసీకి, సొసైటీలకు ఎలాంటి సహకారం అందించిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోగా...నామినేటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్‌చార్జిలను నియమించడంతో రెగ్యులర్ పాలకవర్గాలకు ఉన్నంత బాధ్యత ఉండదని చెబుతున్నారు.

రాష్ట్రంలోనే చివరిస్థానం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో అనంతపురం చివరి స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో కృష్ణా జిల్లా నిలవగా, రెండో స్థానంలో కాకినాడ, తృతీయ స్థానంలో ఏలూరు.. చివరిస్థానంలో అనంతపురం ఉన్నాయి. ప్రథమ స్థానంలో ఉన్న కృష్ణా జిల్లా రూ.10వేల కోట్ల టర్నోవర్‌లో ఉండగా... అనంతపురం రూ.1800 కోట్లు మాత్రమే టర్నోవర్ చేస్తోంది. పక్కనే ఉన్న కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు సైతం రూ.4వేల కోట్ల టర్నోవర్‌తో ముందు వరుసలో ఉన్నారు.

భారమైన నియామకాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడీసీసీ బ్యాంకుకు సంబంధించి 28 శాఖలు ఉన్నాయి. మొత్తం 220 మంది ఉద్యోగులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం 140 మంది మాత్రమే ఉద్యోగులు ఉండేవారు. అప్పట్లో రూ.60లక్షల వరకు జీతాలకు వెచ్చించేవారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో 80 మందికి ఉద్యోగ నియమాకాలు చేపట్టారు. 140 మంది ఉద్యోగులు ఉన్నప్పుడు ఎంత ఆదాయం ఉందో.. 220మంది ఉద్యోగులు ఉన్నప్పుడు కూడా అదే ఆదాయం వస్తోంది. ఉద్యోగుల వేతనాలు రూ.60లక్షల నుంచి రూ.1.10 కోట్లకు పెరిగింది. దీంతో బ్యాంకుకు ఆర్థిక భారంగా మారింది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకంతో..

బ్యాంకుతోపాటు సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం పురోగతికి అడ్డంకిగా మారింది. ఎన్నికల్లో గెలిచి వచ్చిన పాలకవర్గాలకు ఉన్న బాధ్యత.. తాత్కాలికంగా పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమితులైన వారికి ఉండడం లేదనేది బ్యాంకు పురోగతిని చూస్తేనే అర్థమవుతుంది. ఐదేళ్లపాటు పర్సన్ ఇన్‌చార్జిలను నామినేట్ చేయడంతోనే కాలం వెల్లబుచ్చారు. సీనియర్ అధికారుల మధ్య సమన్వయ లోపం, విధులకు చుట్టపుచూపుగా వచ్చిపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది.

నష్టాల్లో ఉన్నది నిజమే



ఏడీసీసీ బ్యాంకు పూర్తిగా నష్టాల్లో ఉన్నది నిజమే. బ్యాంకుతో పాటు సొసైటీలు పూర్తి నష్టాల్లో ఉన్నాయి. వాటిని నష్టాల్లో నుంచి గట్టెక్కించడానికి ప్రయత్నిస్తున్నాం. దీనికి చాలా సమయం పట్టేలా ఉంది. ఇప్పట్లో బ్యాంకు, సొసైటీలు కోలుకోవడం అంత సులువైన పనికాదు. అందరం కలసి నష్టాల్లో నుంచి బయట పడేసేందుకు శ్రమిస్తున్నాం. పురోగతిలో నడిపించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

- శివనారాయణశర్మ, జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి

గంజాయి విక్రేత అరెస్టు

గుంతకల్లుటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షికారి కాలనీకి చెందిన గంజాయి విక్రేత షికారి అంజనీని ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అంజనీ కర్ణాటక రాష్ట్రం బళ్లారి రైల్వే స్టేషన్‌లో కేజీ గంజాయిని కొనుగోలు చేసి గుంతకల్లులో విక్రయిస్తున్నాడు. సమాచారం అందడంతో వన్‌టౌన్ సీఐ మనోహర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. గంజాయి అమ్ముతున్న షికారి అంజనీని వెంటనే అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.37వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి అతన్ని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెల ఏర్పాటుకు యత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



అక్కంపల్లి సమీపంలోని భూమిలో గుమికూడిన జనం

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు గుడిసెలు వేసేందుకు యత్నించ గా, విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని రాచానపల్లి పొలం సర్వే నెంబరు 160-1లోని 4.02 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు దళితుల ముసుగులో గుడిసెలు వేసేందుకు ఆదివారం ప్రయ త్నాలు చేశారు. ఈ విషయాన్ని పలువురు తహసీల్దార్ మోహన్‌కుమార్ దృష్టికెళ్లడంతో ఆయన రెవెన్యూ సిబ్బందిని అక్కడకు పంపించారు. గుడిసెలు వేసే ప్రక్రియను నిలిపి వేయించారు. గతంలో ఇదే విధంగా అప్పటి అధికారులు అడ్డుకుని ప్రభుత్వ స్థలంలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయించారు. భూమిలోకి ఎవ్వరూ వెళ్లకూడదని ఆదేశించారు. తిరిగి ఆదివారం అదే భూమిలో గుడిసెలు వేసేందుకు ప్రయత్నాలు చేయడంపై విమర్శలు వినవచ్చాయి. భూమిలోకి వెళ్లకూడదని గతంలోనే చెప్పామని, మళ్లీ అవే ప్రయత్నాలు చేస్తున్నారని తహసీల్దార్ మోహన్‌కుమార్ అన్నారు. గుడిసెలు వేసేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ తెలిపారు.

నిలువెత్తు నిర్లక్ష్యం



రాప్తాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్ల పల్లి వద్ద 44వ జాతీయ రహ దారి పక్కన ఉన్న హై ఓల్టేజ్ విద్యుత్ స్తం భాన్ని పూర్తిగా పిచ్చి మొక్కలు, తీగ లు అల్లుకున్నాయి. స్తంభం నిలువునా ఎగబాకాయి. జాతీయ రహదారి పక్క నే ఇలా ఉన్నా విద్యుత్ శాఖ అధికా రులు పట్టించు కోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలను ఎవ రైనా పొరపాటున తగిలితే, వారు వి ద్యుదాఘాతానికి గురయ్యే అవకాశ ముంది. విద్యుత్ అధికారులు స్పం దించి స్తంభానికి అ ల్లుకు న్న తీగలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తం

30 లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎస్ఆర్‌బీఎస్ పింఛన్ కోసం 2025 సంవత్సరానికి సంబంధించి ఈనెల 30వ తేదీ లోగా లైఫ్ సర్టిఫికెట్లను సమ ర్పించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికెట్ దరఖాస్తు ఫారాలు అనంతపురం డిపో వద్ద ఉచితంగా అందిస్తున్నట్లు తెలి పారు. దరఖాస్తును పూర్తి చేసిన తర్వాత సంబంధిత డీఎం ద్వారా ధ్రువీకరించి, ఈనెల 30వ తేదీలోగా సంబంధిత కార్యాలయాల్లో అందజేయాల న్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 99854 31084 సంప్రదించవచ్చని తెలిపారు.

పశువుల సంత ఆదాయం రూ.4.45 లక్షలు

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మా ర్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కె ట్‌కు రూ.4,45,020 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. మార్కెట్‌లో శనివా రం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,69,870, ఆదివారం జరి గిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,75,150 వచ్చిందని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

రాప్తాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినేపల్లిలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వ హించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు, టీడీపీ కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయిం చారు. రూ. 100తో సభ్యత్వం నమోదు చేసుకుంటే రెండేళ్ల పాటు రూ. 5 లక్షలు ప్రమాద బీమా, రూ. 10 వేలు మట్టి ఖర్చులకు ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శివ, టీడీపీ నాయకులు రాము, వాటర్‌షెడ్ చైర్మన్ పోతులయ్య, శేఖర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ



ఆశ్రమ విద్యార్థులకు నిత్యావసరాలు, విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూర్ నగర్‌లోని ఎయిమ్ ఫర్ సేవ బాలుర ఆశ్రమానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యవసరాలు వితరణ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు చక్రవాణిని ఆదివారం కలిసి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి చేతుల మీదుగా బియ్యం ప్యాకెట్లు, విద్యాసామాగ్రి, నిత్యావసర వస్తువులను అందజేశారు. అ నంతరం ఆశ్రమంలో ఉండి ఆరు నుంచి ప దో తరగతి వరకు చదువుకుంటున్న విద్యా ర్థులకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యు రాలు సౌదామిని తదితరులు పాల్గొన్నారు.

విజయసాయికి అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయ సాయికుమార్

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సాయి ట్రస్టు అధ్యక్షుడు వి జయ సాయికుమార్ జాతీయస్థాయి ఉత్త మ సేవ అవార్డు అందుకున్నారు. అరికపూ డి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు, సేవకులకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందర య్య విజ్ఞాన కేంద్రంలో ఉత్తమ సేవ పురస్కారాలు ప్రదా నం చేశారు. అందులో జిల్లాకు చెందిన సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్‌కు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రముఖ రచయిత బిక్కి కృష్ణ చేతులమీదుగా జాతీయ ఉత్తమ సేవా అవార్డు అందజేసి సత్కరించారు.

హర్యానా మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రానికి చెం దిన 15 ఫుల్ మద్యం బాటిళ్లను అనంత పురం ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు పట్టుకు న్నారు. కడప జిల్లా తొండూరుకు చెందిన వినయ్‌కుమార్‌రెడ్డి, గార్లదిన్నె మండలానికి చెందిన రాజా ఆదివారం సాయంత్రం కడప జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులో అనంతపురం నగరానికి మద్యం బాటిళ్లను తీసుకొచ్చారు. ఎక్సైజ్ సీఐ సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ జయనరసింహ, సిబ్బందితో కలిసి స్థానిక పాతూరు తాడి పత్రి బస్టాండ్ వద్ద ఇద్దరి నుంచి హ ర్యా నాకు చెందిన 15 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేశారు. ఈ దాడిలో హెచ్‌సీ శివ, కానిస్టేబుళ్లు హరి నాథ్‌రెడ్డి, వీరనారప్పరెడ్డిలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజీవ్‌కాలనీకి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. రాజీవ్‌కాలనీకి చెందిన శ్రీరాములు కుమారుడు శివ(22) కక్కలపల్లి కాలనీలో ఉంటున్న ఓ టమోటా మండీలో పనిచేస్తు న్నాడు. ఆదివారం సాయంత్రం 6.30గంటల సమయంలో తన ఇంట్లో ఉరివేసుకుని మృ తి చెందాడు. ప్రేమ వ్యవహారమే కారణమ ని తెలుస్తోంది. తమకింకా ఫిర్యాదు అందలే దని త్రీటౌన్ పోలీసులు చెబుతున్నారు.

దేవాలయాల పరిరక్షణకు శంఖారావం

● వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య



హైందవ శంఖారావం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మం, ఆగమ శాస్త్ర ప్రాముఖ్య త, హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావం పూరించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమ య్య పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వ ర్యంలో ఆదివారం నగరంలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో హైందవ శంఖారావం పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సం దర్భంగా తాళంకి వెంకట రత్నమయ్య మాట్లాడుతూ... హైందవ సంప్రదాయంలో వెలసిన దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడానికి ముందుగా కొన్ని సవరణ లు చేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు సంబంధించి పలు డిమాండ్లపై జనవరి 5న విజయవాడలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి రమణబాబు, రామ్మూర్తి, యుగంధర్‌రెడ్డి, లక్ష్మణ్, విశ్వనాథరెడ్డి, సోమశేఖర్, కిషోర్, రవి, చంద్ర, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం: బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు పార్థసారథి, పాల్గొన్న సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, నవబంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రథమస్థాయి రాజకీయ పార్టీ అయిన బీజేపీ, కార్యకర్తల సంక్షేమానికే పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ నిర్మాణ కార్యశాలి సమావేశాన్ని నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే పార్థసారథితోపాటు సందిరెడ్డి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 45రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మంది కార్యకర్తలుగా బీజేపీ సభ్యత్వం తీసుకోవడం పార్టీ బలోపేతానికి సంకేతాలని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రజాపాలనతో గ్రామీ ణ ప్రాంతాల నుంచి పట్టణాలు, నగరాల వరకు ప్రజల్లో బీజేపీ పట్ల గౌరవం పెరిగిందన్నారు. భవిష్యత్తులో ఏపీలో బీజేపీ బలపడుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రత్నమయ్య, లక్ష్మీదేవి, వసుంధర, లలిత్‌కుమార్, అశోక్‌రెడ్డి, శ్రీధర్, విశ్వనాథ్, రాజేష్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: సీఐ

గార్లదిన్నె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య పేర్కొన్నారు. గార్లదిన్నె, శింగన మల మండలాల్లోని 44వ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతు న్న గార్లదిన్నె, తలగాసిపల్లి, కల్లూరు, తరిమెల క్రాస్ జంక్షన్, లోలూరు జంక్షన్ తదితర ప్రాంతాలను స్థానిక ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌భాషాతో కలసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... జాతీయ రహదా రిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ఇటీవల శింగనమల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా రహదారిపై మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శాశ్వత వజ్రకవచ సేవకు విరాళం

గుంతకల్లుటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి శాశ్వత వజ్రకవచసేవకు బెంగళూరుకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. స్కందదర్శన్, లక్ష్మీశిరీష దంపతులు స్వామివారి శాశ్వత వజ్రక వచసేవకు గాను రూ.లక్ష నగదును ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు ఆది వారం అందజేశారు. అనంతరం అర్చకులు వారికి స్వామి దర్శనం చేయించి, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యేల సన్మానం



మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మడకశిర, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సన్మానించారు. ఆదివారం హైదరా బాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయల్ మురళి, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే అవినీతి రహిత సమాజం సాధ్యం

● నెహ్రూ యువకేంద్రం అధికారులు



క్విజ్ పోటీల్లో విజేతలతో అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత భాగస్వామ్యంతోనే అవినీ తి రహిత సమాజ స్థాపన సాధ్యమవుతుందని నె హ్రూ యువకేంద్రం అధి కారులు పేర్కొన్నారు. కేం ద్ర క్రీడలు యువజన శా ఖ, మై భారత్, నెహ్రూ యువకేంద్రం, ప్రగతిపథం యూత్ అసోసి యేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్‌వైకే కార్యాలయంలో విజి లెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా యువతకు క్విజ్ పోటీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. అనంతరం క్విజ్ పోటీ ల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రెజరీ అధికారి సతీష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత భరత్, ప్రొఫెసర్ ప్రణతి, మానసిక వైద్యనిపుణులు గురుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, సభ్యు లు నందిత, ప్రిసిల్లా, దేవహర్ష, ఎర్రిస్వామి, కార్తీక్, అభిలాష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి విముక్తి

● మాజీ మేయర్ స్వరూప



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ మేయర్ స్వరూప

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలుగుతుందని, ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నగ ర మాజీ మేయర్ మదమంచి స్వరూప పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. టీచర్ వన్నూరప్ప- సాఫ్ట్‌వేర్ ఇంజనీరు శాంతన్ జోడి విజేతలుగా నిలువగా, రైపర్ రవీంద్రరెడ్డి- కాంట్రాక్టర్ హనుమంతరెడ్డి జోడి ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో కాంట్రాక్టర్ ధనుంజయనాయుడు- విద్యుత్తు శాఖ రమణ జోడి నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మేయర్ స్వరూప విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. పోటీల స్పాన్సర్లు కాంట్రాక్టర్ గంగాధర్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ కరుణాకర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వైకే శ్రీనివాస్, పీవీకేకే సుబ్బారావు, కోశాధికారి రామాంజినేయులు, ఉపాధ్యక్షులు ప్రసాద్, రామకృష్ణారెడ్డి, నరేంద్ర, సహాయ కార్యదర్శులు బాబు, నరసప్ప, టీచర్ శ్రీనివాసులు, డీఎస్ఏ కోచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

పులివెందుల టౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల పట్టణం లోని బ్రాహ్మణపల్లె రోడ్డు శేషారెడ్డి స్కూల్ సమీపంలో నివాసముంటున్న బాబుల్ రెడ్డి (35) ఆదివారం ఉదయం ట్యాంకు పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం వెన్నపూస పల్లికి చెందిన బాబుల్‌రెడ్డి తల్లిదండ్రులు చనిపోవడంతో పులివెందులలో ఉంటున్న మేనత్త లక్ష్మమ్మ దగ్గర ఉంటున్నాడు. కాగా కొన్నేళ్ల నుంచి మితిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం స్థానిక రంగనాథ ఆలయం సమీపంలో ఉన్న నీటి ట్యాంకు ఎక్కి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విష్ణు సంఘటనా స్థలాని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల సర్వజనాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనంతలో సందడి చేసిన హీరో శ్రీకాంత్

● అట్టహాసంగా శ్రేయాస్ గ్రాండ్ హోటల్ ప్రారంభోత్సవం



శ్రేయాస్ గ్రాండ్ హోటల్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరో శ్రీకాంత్

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరో శ్రీకాంత్ అనంతలో సందడి చేశారు. నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పా టు చేసిన శ్రేయాస్ గ్రాండ్ హోటల్ 'టేస్ట్ ఆఫ్ పులావ్స్' వెజ్ అండ్ నాన్‌వెజ్ రె స్టారెంట్ ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సినీ హీరో శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ... అనంతపురానికి చాలాసార్లు వచ్చానని, ఇక్కడ తనకు స్నేహితులు ఉన్నారన్నారు. ప్రస్తుతం తాను వైజయంతి మూవీస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చాంపియన్ సిని మాలో నటిస్తానని, త్వరలో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. అనంతరం శ్రేయాస్ గ్రాండ్ హోటల్ నిర్వాహకుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... అనంతవాసుల అభిరుచికి అనుగుణంగా మంచి మంచి వంటకాలను తమ హోటల్‌లో అందుబాటు ధరల్లో ఏర్పాటు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హోటల్ వెలుపల తమ అభిమాన నటుడిని చూసేందుకు వచ్చిన అభిమానులను హీరో శ్రీకాంత్ పలుకరిస్తూ అభివాదం చేశారు. శ్రీకాంత్‌ను సెల్‌ఫోన్లలో బంధించేందుకు అభిమానులు పోటీ పడ్డారు.

కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎంపిక

● అధ్యక్షుడిగా హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా భరత్



నూతన కమిటీ సభ్యులను సత్కరించిన తోటి ఉద్యోగులు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ యూనిట్ రెవె న్యూ అసోసియేషన్ కార్యవర్గం ఎంపికైంది. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ఆదివారం ఉద్యోగుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరిప్రసాద్ (డిప్యూటీ తహసీల్దార్), ప్రధాన కార్యదర్శిగా దాసరి భరత్‌కుమార్ (జూనియర్ అసిస్టెంట్) ఎంపికయ్యారు. అలాగే కోశాధికారిగా శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులుగా అనూరాధ, లీలాకాంత్, జి లాన్‌బాష, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పవన్‌కుమార్, జాయింట్ సెక్రెటరీలుగా ఈశ్వర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, అక్రమ్ ఎంపికయ్యారు. అనంతరం నూతన కమిటీని తోటి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం...



ఎన్నికైన నూతన కార్యవర్గం

అనంతపురం రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అసోసియేషన్ అనంతపురం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని కృష్ణ కళామందిరంలో డివిజన్ అసోసియేషన్ ఎన్నికలు జరిగా యి. శింగనమల తహసీల్దార్ బ్రహ్మయ్య ఎన్నికల అధికారిగా వ్యవహ రించారు. అధ్యక్షుడిగా శ్రీనివాసమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రజాక్ వలి, కార్యదర్శిగా నారాయణస్వామి, కోశాధికారిగా మంజునాథ్, వైస్ ప్రెసి డెంట్లుగా సూర్యప్రతాప్, బాలమ్మ, కరుణాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సందీప్‌కృష్ణ, సహాయ కార్యదర్శిగా దివాకర్‌రెడ్డి, నాగేంద్ర, శ్రీనాథ్ ఎన్నికయ్యారు.

బహుజన ఉద్యోగులు ఏకంకావాలి

● ఏపీ విద్యుత్ బహుజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బహుజన ఉద్యోగులందరూ ఏకం కావాలని ఏపీ విద్యుత్ బహుజన ఉద్యోగుల సంఘం, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్జీవో హోంలో ఆదివారం విద్యుత్ శాఖ ఏపీఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు రవిశంకర్ అధ్యక్షతన ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య హాజరై మాట్లాడారు. జ్యోతిరావ్ పూలే, అంబేద్కర్ మార్గంలో సమస్యలపై పోరాటా నికి సిద్ధం కావాలన్నారు. అనం తరం జిల్లా విద్యుత్ బహుజన ఉద్యోగుల అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడిగా మహేశ్వరరావు, కా ర్యదర్శిగా శ్రీధర్‌ను ఎన్నుకొన్నారు. అదేవిధంగా యూనియన్ రీజినల్ అధ్యక్షుడిగా సమీవుల్లా, కార్యదర్శి గా మస్తాన్‌వలిని ఎన్నుకొన్నారు. ఈకార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజన్ ఈఈ రాజశేఖర్, డీఈఈ వివేకనందస్వామి, ఏఈఈ హమీ దుల్లా బేగ్, సబ్ ఇంజనీర్లు ఫి రోజ్, శంకర్ నారాయణ, కార్మి కుల సంఘం నాయకులు నాగా ర్జున తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారుల జిల్లా కార్యవర్గం ఎంపిక

● అధ్యక్షుడిగా మల్లికార్జున
● ఉపాధ్యక్షుడిగా మారెప్ప





సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు, మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు3, (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా బీట్ ఆఫీసర్ మారెప్ప ఎంపికయ్యారు. స్థానిక టీవీటవర్ సమీపంలోని వన మిత్రలో ఆదివారం అనంతపురం ఉమ్మడి జిల్లా జూ నియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక కార్యక్ర మాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివా సులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా మల్లికా ర్జున, ఉపాధ్యక్షుడిగా మారెప్ప, కార్యదర్శిగా రామచంద్రారె డ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అక్కులప్ప, జాయింట్ సెక్రెటరీగా నీలవేణి, ట్రెజరర్‌గా సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు ఉమ్మడి జిల్లాలోని డీఆర్వోలు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షుడు మారెప్ప మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలనైనా తమదృష్టికి తెస్తే, పరిష్కరిం చేందుకు తమవంతు చర్యలు చేపడతామన్నారు. త మపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విమల్, కర్నూల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు శివ రాం, ఉమ్మడి జిల్లా నుంచి డీఆర్వోలు హుసేనప్ప, రామచంద్రనాయక్, దీప, జాప్లానాయక్, సెక్షన్ ఆఫీ సర్లు నారపరెడ్డి, అక్బర్, దామోదర్, దామోదర్ రెడ్డి, షాహనవాజ్, కరీముల్లా, జగన్నాథం, మల్లికార్జు న, చంద్రానాయక్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- పోషణ్ వాటికాస్ కంపొనెంట్ కింద రూ.10వేలు
- కేంద్రం వద్దే ఆకుకూరలు, కూరగాయల సాగు

యాడికి, నబంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ రానుంది. అంగన్‌వాడీలో వినియోగించే ఆకుకూరలు, కూరగాయలు ఇకపై ఆ కేంద్రాల వద్దే సాగుచేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పోషణ్‌వాటికాస్ కాంపొనెంట్ కింద అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10వేలు అందించనున్నట్లు ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. సొంత భవనం కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ్ వాటికాస్‌ను ప్రయోగాత్మకంగా చేపట్టనున్నట్లు సీడీపీఓ తెలిపారు. మొదటి విడతలో భాగంగా మండల వ్యాప్తంగా 12 అంగన్‌వాడీ



యాడికిలోని అంగన్‌వాడీ కేంద్రం

కేంద్రాలను ఎంపిక చేశారు. పోషణ్ వాటికాస్ కింద ఎంపికైన కేంద్రాల్లో యాడికిలోని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు నిట్టూరు, చందన, పచ్చారుమేకలపల్లి ఉన్నాయి. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10వేలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మునగ, నిమ్మ, బొప్పాయి తదితర 8 రకాల మొక్కలు, ఆకుకూరలు పెంచనున్నారు. వీటినే అంగన్‌వాడీ కేంద్రంలో వంటకు వినియోగిస్తారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద చేపట్టే పోషణ్ వాటిక ద్వారా పెంచే ఆకుకూరలు, కూరగాయల ద్వారా పిల్లల్లో రక్తహీనత, అనీమియా వంటి వ్యాధులు నివారించడానికి ఎంతో ఉపయోగపడేలా వీటిని తీర్చిదిద్దనున్నారు.

నిధుల వినియోగం ఇలా..

పోషణ్ వాటికాస్‌లో భాగంగా అందించే రూ.10వేలను మొక్కల పెంపకానికి వాడే నల్లమట్టి, ఎర్రమట్టి కొనుగోలు, టబ్‌లు, కుండీల కొనుగోలు తదితర అవసరాలకు ఈ మొత్తాన్ని వాడుకోవచ్చు. మునగ, బొప్పాయి, నిమ్మ తదితర మొక్కలను అధికారులే అందిస్తారు. పోషణ్ వాటికలు సక్రమంగా నిర్వహిస్తే అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించే ఆకుకూరలు, కూరగాయలు మార్కెట్‌లో కొనాల్సిన అవసరం ఉండదు. అంగన్‌వాడీలు మార్కెట్‌కు వెళ్లాల్సిన శ్రమ ఉండదు.

ఎంతో ఉపయోగం..



పోషణ్ వాటికల ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల వద్దే అవసరమయ్యే కూరగాయలు, ఆకుకూరల సాగు చిన్నారులకు అవసరమయ్యే పోషక పదార్థాలను అందించగలుగుతాం. రసాయనాలు వాడకుండా సహజంగా ఆకు కూరల మొక్కలు పెంచడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవు. పోషణ్‌వాటికల ఏర్పాటు అభినందనీయం.

-హేమలత, అంగన్‌వాడీ వర్కర్

ప్రజల సహకారం అవసరం



అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ్‌వాటికల ఏర్పాటులో సమీప ప్రజల సహకారం ఎంతో అవసరం. మన పిల్లల ఆరోగ్యం కోసమే వీటిని చేపడుతున్నారని, వాటిని కాపాడుకోవడంలో బాధ్యత వహించాలి. అప్పుడే పోషణ్‌వాటికలను మెరుగ్గా నిర్వహించుకోవచ్చు. యాడికి మండలంలో మొదటి విడతగా 12అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటిక ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. సొంత భవనాలు కలిగిన మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కూడా మలివిడతలో పోషణ్‌వాటికలు ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

-విజయకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు

- కోతకు గురైన పలు గ్రామాల రోడ్లు
- నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


కోతకు గురైన కుందేనహళ్లి- బండూరు రోడ్డు


దెబ్బతిన్న సింగానహళ్లి రోడ్డు కల్వర్టు

బొమ్మనహాళ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి మండలంలో పలు రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయి వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బండూరు, కళ్లదేవనహళ్లి, సింగానహళ్లి గ్రామాల రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో దర్గాహోన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం, క ళ్లహోళ్, తార్కాపురం, వన్నళ్లి, హోసళ్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించలేకపోతున్నారు. అత్యవస ర పరిస్థితుల్లో వెళ్లాలంటే దాదాపు 40 కిలోమీటర్ల మేర చుట్టేసుకుని వెళ్లాల్సి వస్తోంది. అలాగే బండూరు, దేవగిరి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, హరేసముద్రం గ్రామాల ప్రజలు ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురం ప్రాంతాలకు వెళ్లాలంటే బళ్లారికి వెళ్లి అక్కడి నుంచి చేరుకోవాల్సి వస్తోంది. ఇక రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు వెళ్లాలంటే వాగులో నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఇలా ఎన్నాళ్లు అవస్థలు పడాలని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్పందించి తెగినరోడ్లు, కల్వర్టులను వెంటనే బాగు చేయించాలని వారు కోరుతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే



ఇటీవల కురిసిన వర్షానికి వచ్చిన వరదతో బండూరు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో వ్యవసాయ పనుల కోసం ఆగ్రామం దగ్గరి పొలాలకు వెళ్లాలంటే వాగు దాటేల్సిందే. వాగులో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. తమ ఇబ్బందులను గుర్తించి అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

- సంగప్ప, కందేపల్లి

40 కి.మీ మేర చుట్టేయాలి



మండల కేంద్రానికి వెళ్లాలంటే కర్ణాటకలోని రూపనగుడికి వెళ్లి 40 కిలోమీటర్ల మేర చుట్టేసుకుని వెళ్లాలి. నిత్యం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వెళ్తుంటాం. రోడ్డు కోతకు గురి కావడం వల్ల వెళ్లలేక పనులను వాయిదా వేసుకుంటున్నాం.

- సంజప్ప, గోవిందవాడ

డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభం

రాయదుర్గం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసు లు ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్‌ను ఆదివారం పునః ప్రారంభించారు. పట్టణంలోని టెక్స్‌టైల్స్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో కోచింగ్ ఫ్యాకల్టీ హాజరై బోధనను ప్రారంభించారు. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో నిరుపేద అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వి యోగం చేసుకోవాలని కోరారు.

కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

గుంతకల్లుటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం. రాజ్‌కుమార్ (డిప్యూటీ తహసీల్దార్, యాడికి), ఉపాధ్యక్షులుగా ఎం. నరేష్‌కుమార్ (డిప్యూటీ తహసీల్దార్, వజ్రకరూరు), ఎస్. రమాదేవి(తహసీల్దార్, గుంతకల్లు), వీ. లహరి(ఆర్‌ఐ పెద్దవడూగురు), కార్యదర్శిగా యూ.ఆదినారాయణ(స్టాకిస్ట్, గుత్తి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వై. హరిప్రసాద్(ఆర్‌ఐ, గుంతకల్లు), సహాయ కార్యదర్శులుగా పీ. షెక్షావలి (సీనియర్ అసిస్టెంట్, ఆర్డీఓ కార్యాలయం గుంతకల్లు), ఎస్. శర్మాస్‌వలి (ఆఫీస్ సబార్డినేట్, ఉరవకొండ), హెచ్. వన్నప్ప(సీనియర్ అసిస్టెంట్, ఆర్డీఓ కార్యాలయం గుంతకల్లు), ట్రెజరర్‌గా ఎంకే. సుబ్రహ్మణ్యం(సీఎస్‌డీటీ, గుత్తి), ఈసీ సభ్యులుగా ఉదయ్‌భాస్కర్ (డిప్యూటీ తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయం గుంతకల్లు), కే. గురుప్రసాద్(సీనియర్ అసిస్టెంట్, విడపనకల్లు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎస్ మహబుబ్‌బాషా తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో డివిజన్ అసోసి యేషన్‌కు 2024-2027 సంవత్సరాలకు సంబంధించిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా రత్నశ్యామ్‌రాయ్ (డిప్యూటీ తహసీల్దార్, బొమ్మనహాళ్), ఉపాధ్యక్షులుగా బసవకుమార్ (డిప్యూటీ తహసీల్దార్, డీ హీరేహాళ్), విజయలక్ష్మీ (డిప్యూటీ తహసీల్దార్, గుమ్మఘట్ట), తిప్పేస్వామి (డిప్యూటీ తహసీల్దార్, కుందుర్పి), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గౌతమ్ (ఆర్‌ఐ,శెట్టూరు), జాయింట్ సెక్రెటరీలుగా నాగిరెడ్డి (ఆర్‌ఐ, బ్రహ్మసముద్రం), తలారి వెంకటేశులు (సీనియర్ అసిస్టెంట్, కళ్యాణదుర్గం), శ్రీనివాసులు నెహ్రూ (కళ్యాణదుర్గం రెవెన్యూడివిజనల్ కార్యాలయ డ్రైవర్), ట్రెజరర్‌గా వెంకటేశులు (డిప్యూటీ తహసీల్దార్, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం) ఎన్నికయ్యారు.

విద్యార్థులకు పోటీలు

ఉరవకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ దివారం నిస్వార్థ సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది దాకా విద్యా ర్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు వేసిన డ్రాయింగ్ ఆకట్టుకుంది. ఈ పో టీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఈనెల 14వ తేదీ న బహుమతులు అందజేయనున్నారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణకు శంఖారావం

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం, ఆగమ శాస్త్ర ప్రాముఖ్యత, హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావం పూరించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో హైందవ శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాళంకి వెంకట రత్నమయ్య మాట్లాడుతూ... హైందవ సంప్రదాయంలో వెలసిన దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడానికి ముందుగా కొన్ని సవరణలు చేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు సంబంధించి పలు డిమాండ్లపై జనవరి 5న విజయవాడలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. హిందువులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి రమణబాబు, రామ్మూర్తి, యుగంధర్ రెడ్డి, లక్ష్మణ్, విశ్వనాథరెడ్డి, సోమశేఖర్, కిషోర్, రవి, చంద్ర, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష ఫిబ్రవరిలో నిర్వహించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షను ఫిబ్రవరిలో నిర్వహించాలని డీవైఎఫ్‌ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాబోయే డీఎస్సీ , టెట్, ఇంటర్ పరీక్షలను పరిగణనలోకి తీసుకుని గ్రూప్-2 రాత పరీక్షను జనవరి 5న నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ కమిషన్ ప్రకటన విడుదల చేసిందన్నారు. అయితే డిసెంబరులో కానిస్టేబుల్ ఈవెంట్స్, రైల్వే పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రూప్-2 పరీక్షను ఫిబ్రవరిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డీవైఎఫ్‌ఐ నాయకుల సునీల్, మల్లేష్ పాల్గొన్నారు.

శాశ్వత వజ్రకవచ సేవకు విరాళం

గుంతకల్లుటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి శాశ్వత వజ్రకవచసేవకు బెంగళూరుకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. స్కందదర్శన్, లక్ష్మీశిరీష దంపతులు స్వామి వారి శాశ్వత వజ్రకవచసేవకు గాను రూ. 1లక్ష నగదును ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు ఆదివారం అందజేశారు. అనంతరం అర్చకులు వారికి స్వామి దర్శనం చేయించి, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థినులకు క్రీడా పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ మహిళల టోర్నమెంట్ 2024-25 పేరిట విద్యార్థినులకు క్రీడా పోటీలు ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరికుమార్, ఎస్కే యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ బీ జెస్సీ హాజరయ్యారు. కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, బాల్‌బాడ్మింటన్, వాలీబాల్, షటిల్, చెస్, టెబుల్‌టెన్నిస్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 20 కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండా, స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థినులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. అనంతరం ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ కార్యదర్శి జెస్సీ, కరెస్పాండెంట్ కేసీ హరికుమార్ ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విడపనకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ కొత్తకోట గ్రామంలో శైలజ అనే మహిళ నుంచి కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి చంద్ర తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో వీ కొత్తకోటలో తనిఖీలు చేశామని, అందులో శైలజ అనే మహిళ వద్ద 48 టెట్రా ప్యాకెట్లు ఉండడంతో స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో తాడిపత్రి జట్టు సత్తా

తాడిపత్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడురోజులుగా ఆర్డీటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అనంతప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో తాడిపత్రి జట్టు సత్తాచాటింది. తాడిపత్రి, గుంతకల్లు, అనంతపురం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌ల్లో రెండు జట్లపై 60పరుగుల తేడాతో తాడిపత్రి జట్టు విజయం సాధించింది. అఫ్రిన్‌తాజ్, కార్తీక్‌లు ప్రతిభ చూపి విజయంలో కీలకపాత్ర పోషించారు. విజయం సాధించిన జట్టు సభ్యులను సీనియర్ కోచ్ సాధిక్‌వలి, ఏటీఎల్ లలిత, కోచ్ భార్గవ్ అభినందించారు.

పొలాల్లో కేబుల్ చోరీ

యాడికి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో కేబుల్ దొంగలు పెట్రేగిపోయారు. శనివారం రాత్రి ముగ్గురు రైతుల పొలాల్లో కరెంట్ కేబుల్‌ను కట్ చేసి అపహరించుకెళ్లారు. రైతు శ్రీనివాసులుకు చెందిన అరటితోటలో బోరుబావికి స్టార్టర్‌బాక్స్‌కు మధ్య ఉన్న 40మీటర్ల కేబుల్‌ను కట్‌చేసి తీసుకెళ్లారు. అలాగే వాసు అనే రైతు పొలంలోనూ 30మీటర్ల కేబుల్‌ను కత్తించుకువెళ్లారు. జగదీష్ అనే రైతు తోటలో కూడా 50మీటర్ల కేబుల్‌ను కట్ చేసి ఎత్తుకెళ్లారు. దొంగల దుశ్చర్యతో పంటలు ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని కాపర్, ఆయిల్ చోరీ చేయడం, కేబుల్‌వైర్లను కత్తిరించుకు వెళ్లడం వంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. పోలీసులు తగు చర్యలు తీసుకుని కేబుల్ చోరీలను అరికట్టాలని వారు కోరారు.

హోటల్లోకి దూసుకెళ్లిన కారు

రాయదుర్గం రూరల్, నవంబరు 3: మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఓ హోటల్‌లోకి ఓ కారు దూసుకెళ్లింది. బెళుగుప్పకు చెందిన ఆరుగురు యువకులు శనివారం రాత్రి మద్దానేశ్వర ఆలయం వద్దకు పెళ్లికి వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున వారు అక్కడి నుంచి రాయదుర్గానికి కారులో బయలుదేరారు. కాగా కారు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద హోటల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో ఆ హోటల్‌లో సామగ్రి ధ్వంసమైనట్లు బాధితుడు మాం తేష్ తెలిపాడు. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదన్నారు. సా మగ్రి ధ్వంసమవడంతో రూ. లక్ష నష్టం వాటిల్లిందన్నారు. మద్యం మత్తులో కారు నడపడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని ఆయన పేర్కొన్నాడు.

ట్యాంకు పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య


బాబుల్‌రెడ్డి మృతదేహం

పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు శేషారెడ్డి స్కూల్ సమీపంలో నివాసముంటున్న బాబుల్‌రెడ్డి (35) ఆదివారం ఉదయం ట్యాంకు పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం వెన్నపూసపల్లికి చెందిన బాబుల్‌రెడ్డి తల్లిదండ్రులు చనిపోవడంతో పులివెందులలో ఉంటున్న మేనత్త లక్ష్మమ్మ దగ్గర ఉంటున్నాడు. కాగా కొన్నేళ్ల నుంచి మితిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం స్థానిక రంగనాథ ఆలయం సమీపంలో ఉన్న నీటి ట్యాంకు ఎక్కి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విష్ణు సంఘటనా స్థలాని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల సర్వజనాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నిర్మల

గుత్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా నిర్మల నియమితులయ్యారు. పట్టణంలోని జడ్‌వీరారెడ్డి భవనంలో ఆదివారం జరిగిన మండల మహాసభలో సీపీఎం జిల్లా నాయకురాలు సావిత్రమ్మ సమక్షంలో ఈ నియామకం జరిగింది. అలాగే సీపీఎం మండల కమిటీ సభ్యులుగా రామకృష్ణ, రేణుక, మల్లికార్జున, మల్లేష్, రంజిత్‌నాయక్, రమేష్‌ను నియమించారు.

ఎట్టకేలకు పింఛన్ సొమ్ము పంపిణీ

బొమ్మనహాళ్ , నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లి గ్రామంలో వృద్ధులకు సోమవారం ఎట్టకేలకు పింఛన్ డబ్బులు ఇచ్చారు. గోనేహాళ్ గ్రామ సచివాలయ ఉద్యోగి రమేష్ సింగానహళ్లి గ్రామంలో దాదాపు 15 మంది లబ్ధిదారుల తో వేలిముద్రలు వేయించుకుని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. దీనిపై గత ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో పింఛన్ల సొమ్ము స్వాహా అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఎట్టకేలకు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు సచివాలయ ఉద్యోగి రమేష్ తో ఇప్పించారు. ఆ ఉద్యోగి స్థానిక సర్పంచ్ కృష్ణ సమక్షంలో 11 మంది లబ్ధిదారులకు పింఛన్ ఇచ్చారు. అనారోగ్యం కారణంతో ఆసుపత్రికి వెళ్లడం వల్ల అలస్యం అయిందని అతను తెలిపారు.